క్లుప్తంగా

వారాంతపు కూరగాయల సంత

హఫీజ్‌పేట్: వారాంతపు కూరగాయల సంత గంగారంలో బుధవారం, హుడా కాలనీలో గురువారం, ఆర్టీసీ కాలనీలో బుధవారం, మదీనాగూడ గ్రామంలో ఆదివారం, మైత్రినగర్ మంజీరా రోడ్డులో శనివారం, ఆల్విన్ కాలనీలో గురువారం, ఓల్డ్ హఫీజ్‌పేట్ గ్రామంలో గురువారం, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌లోని సాయిబాబా దేవాలయం వద్ద గురువారం, 5వ ఫేజ్ వద్ద బుధవారం కూరగాయాల సంత ఉంటుంది.

మాదాపూర్ డివిజన్ పరిధిలో..
మాతృశ్రీనగర్‌లో సోమవారం, గోకుల్ ప్లాట్స్‌లో పెద్ద చర్చి వద్ద ఆదివారం, 80 ఫీట్ల రోడ్డులో బుధవారాలలో వారాంతపు కూరగాయల సంతలు నిర్వహిస్తున్నారు.

గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై దాడులు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో అక్రమంగా కొనసాగుతున్న గ్యాస్ రీఫిల్లింగ్ కేంద్రాలపై సివిల్ సప్లయాస్ అధికారులు మంగళవారం దాడులు చేపట్టారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వనజ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 145 సిలిండర్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు.

బస్సు నడుపుతుండగా.. డ్రైవర్‌కు గుండెనొప్పి


చికిత్స పొందుతున్న మోయినుద్దీన్

పటాన్‌చెరు టౌన్: ఆర్టీసీ బస్సు నడుపుతుండగా, డ్రైవర్‌కు గుండెలో నొప్పిగా అనిపించింది. వెంటనే అప్రమత్తమై ప్రయాణికులను పటాన్‌చెరు బస్టాండ్‌లో దింపాడు. ఆపై కండక్టర్ సాయంతో ఆస్పత్రికి వెళ్లాడు. వివరాలు ఇలా ఉన్నాయి. బేగంపేటకు చెందిన మోయినుద్దీన్ రాణిగంజ్ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రాణిగంజ్ టు పటాన్‌చెరు బస్సు నడుపుతున్నాడు. మంగళవారం కూడా డ్యూటీలో భాగంగా డిపో నుంచి బయలుదేరాడు. బస్సు ఆర్‌సీపురం వద్దకు రాగానే మోయినుద్దీన్‌కు గుండెనొప్పి ప్రారంభమైంది. వెంటనే అప్రమత్తమై పటాన్‌చెరు బస్టాండ్ వరకు ప్రయాణికులను సురక్షితంగా తీసుకొచ్చాడు. అనంతరం కండక్టర్‌కు చెప్పగా, చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లారు. విషయం ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా, అక్కడ నుంచి తార్నాకలోని ఆర్టీసీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం డ్రైవర్ ఆరోగ్య పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు.

పేలిన ట్రాలీఆటో టైరు

ఒకరికి తీవ్రగాయాలు

పటాన్‌చెరు టౌన్: ట్రాలీఆటో టైరుపేలిన ఘటనలో డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం పటాన్‌చెరు నుంచి స్క్రాప్‌బ్యాటరీ లోడ్‌ను చాదర్‌ఘాట్‌కు తీసుకెళుతుండగా, పాటి గ్రామశివారు ఓఆర్ఆర్ సమీపంలోకి రాగానే టైరుపేలి ఆటో బోల్తా కొట్టింది. దీంతో డ్రైవర్ మహేష్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పంట రుణాలు మంజూరు చేస్తాం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రైతులకు పంట రుణాలు మంజూరు చేస్తామని తెల్లాపూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఉస్మాన్‌నగర్‌లో జరిగిన మహజన సభలో ఆయన మాట్లాడారు. తెల్లాపూర్ సహకార సంఘం అభివృద్ధికి సభ్యులు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ప్రతి సభ్యునికి పంట రుణాలు ఇచ్చేందుకు సొసైటీ సిద్ధంగా ఉందన్నారు. సభ్యులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వ్యవసాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ చిట్టి, ఆత్మకమిటీ సభ్యులు యాదయ్య, సొసైటీ వైస్ చైర్మన్ మధు, డైరెక్టర్లు నాగిరెడ్డి, సునీల్, కుమ్మరి యాదయ్య, మోహన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, లచ్చ నాయక్ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


విజయగిరి రాహుల్ (ఫైల్)

మాదాపూర్: యువకుడు అదృశ్యమైన ఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఈనెల 26న మధ్యాహ్నం 2 గంటల సమయంలో కొండాపూర్‌లోని హనుమాన్‌నగర్‌లో నివాసముంటున్న విజయగిరి రాహుల్(23) తన సొంత గ్రామమైన కాల్వ శ్రీరాంపూర్, పెద్దపల్లి జిల్లాకి వెళ్లి వస్తానని తన అన్నకు చెప్పిన రాహుల్ ఆరోజు సాయంత్రం నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుని మళ్లీ ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువులను అడిగి తెలుసుకున్నప్పటికీ ఎలాంటి సమాచారం తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీతారాముల కల్యాణానికి సర్వం సిద్ధం

- వాడవాడలా నిర్వహించేందుకు సన్నాహాలు
- ముస్తాబవుతున్న ఆలయాలు
- పలు చోట్ల ప్రత్యేక పందిళ్ల నిర్మాణం
- భారీగా ఏర్పాట్లు చేస్తున్న కమిటీ ప్రతినిధులు


విద్యుత్ దీపాలతో జీపీఆర్ఏక్వార్టర్స్‌లోని ఆలయం

రాయదుర్గం: శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని సీతారాముల కల్యాణ మహోత్సవ నిర్వహణకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని పలు కాలనీలు, బస్తీలు ఆయా ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రత్యేకంగా సీతారాముల కళ్యాణోత్సవాన్ని నిర్వహించేందు కు ఆలయ కమిటీ, కాలనీ, బస్తీలలోని కమిటీలు ఏర్పాట్లలో నిమగ్నమయ్యాయి. ముఖ్యంగా ఆలయాల్లో కూడా ప్రత్యేక పందిళ్ల నిర్మాణం చేసి కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులు వివరించారు. రాయదుర్గం, నానక్‌రాంగూడ, మధురానగర్, గౌలిదొడ్డి, ఎన్టీఆర్‌కాలనీ, గోపన్‌పల్లి, జీపీఆర్ఏక్వార్టర్స్, గచ్చిబౌలి, టీఎన్‌జీఓకాలనీ, ఇందిరానగర్ వంటి ప్రాంతాలలో సీతారాముల కల్యాణోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్లు, ఆలయాల్లో ఆలయ కమిటీల పర్యవేక్షణలో కల్యాణోత్సవాన్ని నిర్వహించడంతోపాటు అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

పలు చోట్ల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు..

- గచ్చిబౌలిలోని జీపీఆర్ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణానికి భారీ ఏర్పాట్లు చేశారు. గురువారం ఉదయం 9 గంటలకు జీపీఆర్ఏ క్వార్టర్స్‌లో భారీ శోభాయాత్రను నిర్వహించి స్వామి వారి విగ్రహాలను ఊరేగించి ఆలయంలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు తీసుకొస్తారు. అనంతరం 12 గంటలకు సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన నిర్వహిస్తారు.
- టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి ఆలయంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో కాకడ హారతితో ఉత్సవాలను ప్రారంభిస్తారు. అనంతరం మంగళ స్నానం, బాబావారికి, గణపతి, దత్తాత్రేయస్వామివారికి అభిషేకం, సాయిఅష్టోత్తరం, విష్ణు సహస్రనామం, లక్ష్మీ సహస్రనామం, సాయిసహస్రనామం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తారు. అనంతరం10 నుంచి 12.30 గంటల వరకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తారు.
- గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో శ్రీరామనవమి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవాన్ని క్యాంపస్‌లోని గురుభక్షసింగ్ మైదాన్‌లో నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.
- రాయదుర్గంలోని మండపం వద్ద ప్రతిష్ఠించిన సీతారాముల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు స్థానికులు ఏర్పాట్లు చేశారు. ఉగాది పర్వదినం సందర్భంగా ప్రతియేటా సీతారాములు లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తుంటారు. శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణాన్ని ఉదయం 10 గంటలకు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.
- నానక్‌రాంగూడలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద స్థానికుల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ప్రజలకు అన్నసమారాధన కార్యక్రమాన్ని కూడా ఏర్పాటు చేశారు.

అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా హైదరాబాద్

మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్పష్టీకరణ


సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో డీసీపీ శిల్పవల్లి, ఏడీపీ సంస్థ అధికారులు

రాయదుర్గం: దేశంలోనే అత్యంత సురక్షితమైన నగరాల్లో ఒకటిగా హైదరాబాద్ గుర్తింపు సాధించిందని మాదాపూర్ డీసీపీ శిల్పవల్లి స్పష్టం చేశారు. నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని ఏడీపీ ఐటీ సంస్థ సహకారంతో సైబరాబాద్ పోలీస్ విభాగం 83 సీసీటీవీ కెమెరాలను నానక్‌రాంగూడలో మంగళవారం ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నానక్‌రాంగూడ పరిసరాల్లో కమ్యూనిటీలను అతి దగ్గరగా పరిశీలించడానికి తద్వారా శాంతిభద్రతలను అదుపులో ఉంచడానికి, ఈ ప్రాంతంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఏడీపీ సంస్థ ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఇలాంటి తరహాలోనే ఇతర సంస్థలు కూడా ముందుకొచ్చి సమాజహిత కార్యక్రమాలను చేపట్టాలని ఆమె సూచించారు. ఏడీపీ ఇండియా జనరల్ మేనేజర్ విజయ్ వేములపల్లి మాట్లాడుతూ.. తాము నివశిస్తున్న, కార్యక్రమాలు నిర్వహిస్తున్న ప్రాంతంలో కమ్యూనిటీల పట్ల బాధ్యతతో వ్యవహరించడం ద్వారా ఏడీపీ వారసత్వం విస్తరించిందన్నారు. గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ.. రాయదుర్గం, గచ్చిబౌలి, మాదాపూర్ పరిధిల్లో 2,600 సీసీ కెమెరాలు, నేనుసైతం, ఇతర ప్రైవేటు సీసీ కెమెరాలు 30వేల వరకు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో మాదాపూర్ ఏసీపీ రఘునందన్ రావు, ఏడీపీ సంస్థ ఉన్నతాధికారులు డాక్టర్ విపుల్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

'ఎనిమిటి' స్థలాన్ని పరిరక్షించాలి


సీఐని కలిసిన కాలనీ అసోసియేషన్ సభ్యులు

మియాపూర్: సాయిరాంనగర్ కాలనీలోని ఎమినిటి స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి మియాపూర్ సీఐ తిరుపతిరావును కోరారు. మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో సీఐ తిరుపతిరావును సాయిరాంకాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. సాయిరాం కాలనీకి చెందిన ఎమినిటి స్థలాన్ని కొంత మంది ప్రైవేటు వ్యక్తులు దొంగ రిజిస్ట్రేషన్లు చేసుకొని కబ్జాలకు పాల్పడుతున్నారన్నారు. ఇంతటితో ఆగకుండా కాలనీ అసోసియేషన్ సభ్యులపై భౌతిక దాడులకు పాల్పడుతున్నారన్నారు. కబ్జాదారులు భౌతిక దాడులకు పాల్పడకుండా రక్షణ కల్పించాలని సీఐ తిరుపతిరావును కోరారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, కాలనీ అసోసియేషన్ సభ్యులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, రాజశేఖర్‌రెడ్డి, జయిరాం రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులున్నారు.

సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ అగ్రస్థానం

ప్రభుత్వ విప్ ఆరికెపూడి గాంధీ


మాట్లాడుతున్న ఆరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి: సంక్షేమ పథకాల అమలులో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో మంగళవారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ నాగేందర్‌యాదవ్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల వైపు దేశం మొత్తం చూసుదని గుర్తుచేశారు. కోట్లాది రూపాయాలతో నియోజకవర్గం, శేరిలింగంపల్లి డివిజన్‌ను అభివృద్ధి చేశామన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడే ఏకైక పార్టీ బీఆర్ఎస్ పార్టీనే పేర్కొన్నారు. కష్టపడిన కార్యకర్తలకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందన్నారు. బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వారు పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరేశం గౌడ్, సుజాతయాదవ్, మోహన్‌గౌడ్, సోందాస్, రాజేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధి కార్యకర్తలే

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే రోల్ మోడల్‌గా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు మండలం పాటి గ్రామ శివారులోని ఓ ఫంక్షన్ హాలులో నిర్వహించిన మండల స్థాయి పార్టీ ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యారు. రాబోయే రోజుల్లో అవలంబించాల్సిన విధి విధానాలపై పార్టీ శ్రేణులకు దిశ నిర్దేశం చేశారు. కార్యకర్తలకు పార్టీ రుణపడి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ప్రతి గ్రామంలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సీఎస్ఆర్ నిధులతో ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. పరిపాలన వికేంద్రీకరణకు పెద్దపీటవేసిన మహోన్నత నాయకుడు ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. ప్రజలు తెలివైన వారని, కులం మతం పేరుతో విద్వేష రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీని తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. నియోజకవర్గంలో ఒక్క గుడికి సున్నం వేయని బీజేపీ నాయకులు నేడు హిందూ మతానికి ప్రతినిధుల మని చెప్పుకోవడం సిగ్గుచేటు అన్నారు. లౌకిక వాదానికి పెద్దపీట వేస్తూ నియోజకవర్గంలో 170కి పైగా గుడులు, మసీదులు, ఆశ్రమాలు, దర్గాలు చర్చిలను నిర్మించినా ఎప్పుడూ ప్రచార ఆర్భాటాలకు తావివ్వలేదన్నారు. ఓటు అడిగే నైతిక హక్కు ప్రతిపక్షాలకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుష్మాశ్రీ, జెడ్పీటీసీ సుప్రజా, పార్టీ మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, ఆత్మ కమిటీ చైర్మన్ కుమార్ గౌడ్, ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ మహిపాల్ రెడ్డి, సీనియర్ నాయకులు దశరథ్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పాలక వర్గం ప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

నైపుణ్యాలు నేర్చుకున్నవారికే మంచి ఉపాధి అవకాశాలు


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులతో అతిథులు

రాయదుర్గం: చదువుతోపాటు నైపుణ్యాలు నేర్చుకున్నవారికే మంచి ఉపాధి అవకాశాలు ఉంటాయని అన్వార్స్ టెక్నాలజీస్ లిమిటెడ్ వైస్‌ప్రెసిడెంట్ బీఎస్ కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఎస్కీ)లోని బిజినెస్ స్కూల్ ఆధ్వర్యంలో 'ఎంప్లాయబుల్ స్కిల్స్'అనే అంశంపై ఒకరోజు వర్క్‌షాప్‌ని ఆయన ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావుతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం జాబ్ మార్కెట్ డిమాండ్లు చాలా ఉన్నాయని, ముఖ్యంగా తాము చదివే కోర్సులు పూర్తయ్యేలోగా నైపుణ్యాలు నేర్చుకోవడంపై అందరూ దృష్టి సారించాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ.. ఎస్కీలో ఉద్యోగులు, అధికారులు, విద్యార్థులకు నాణ్యమైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఫ్యాకల్టీ అలిగరాజు ఎస్‌పీజీఎస్ వివిధ పీజీ కోర్సుల గురించి వివరించారు. ఫ్యాకల్టీ డాక్టర్ పద్మ వెంకట్ ఎస్‌పీజీఎస్ ఉపాధి నైపుణ్యాల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్కీ ఏ అండ్ పీ చీఫ్ ఎస్ లక్ష్మీకాంతరావు, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు, ఎస్కీ అధికారులు, ఉద్యోగులు, సికింద్రాబాద్ దివాన్‌బహదూర్ పద్మారావు ముదలియార్ మహిళా కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి


ఎంఏనగర్ వద్ద ప్రధాన రహదారిపై పారుతున్న మురుగు

మియాపూర్: మియాపూర్‌లోని ఎంఏనగర్ ప్రధాన రోడ్డులో మురుగు ప్రవాహంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలల నుంచి మ్యాన్‌హోల్స్ పొంగి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారు. ప్రజా ప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. పొంగి పొర్లుతున్న మ్యాన్‌హోళ్లకు మూతలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు, పాదచారులు భయాందోళన చెందుతున్నారు. మురుగు నీటితో దుర్వాసన భరించలేకపోతున్నామని, దోమలు వృద్ధిచెంది అనారోగ్య పాలవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌సీయూలోని పరిపాలనాభవనం ముందు కార్మికులు చేసిన నిరసనకు హెచ్‌సీయూలోని విద్యార్థి, ఉద్యోగ సంఘాలు సైతం మద్దతు పలికాయి. ఇటీవలి కాలంలో 38 మంది కార్మికులను తొలగించడాన్ని నిరసిస్తూ వారు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. దీంతో అధికారుల చర్యల పట్ల ఉద్యోగ, విద్యార్థి సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కార్మికులు వెంటనే తిరిగి విధుల్లోకి తీసుకోవాలని అందరూ డిమాండ్ చేశారు. ఏప్రిల్ 1వ తేదీ వరకు వారికి తిరిగి విధుల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని లేనట్లయితే భారీ ఎత్తున నిరసన చేపట్టాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్మికులు, కార్మిక నాయకులు, వివిధ విద్యార్థి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య మహిళా కేంద్రం తనిఖీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పట్టణంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య మహిళా కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేతా మొహంతి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిబ్బంది పని తీరు మెరుగుపరుచుకోవాలని సూచించారు. రికార్డులను, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ఓ గాయత్రి, డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగనిర్మల తదితరులు పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ శ్వేతా మొహంతి

ఉచితంగా మహిళలకు నైపుణ్య శిక్షణ

హఫీజ్‌పేట్: కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్ నీలం రాజశేఖరరెడ్డి రీసర్చ్ సెంటర్‌లో ఉచితంగా మహిళలకు కంప్యూటర్ శిక్షణ కేంద్రం నిర్వహిస్తున్నారు. మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్, ఎంబ్రాయిడరీ, మగ్గం, డైయింగ్, ప్రింటింగ్, బ్యూటిషియన్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్‌కు సంబంధించిన పరిజ్ఞానం, ట్యాలీ, డీటీపీ తదితర శిక్షణలు ఉచితంగా అందిస్తున్నారు. మహిళలు మొదట అడిష్మన్ కోసం రూ.150లు చెల్లించాలి. సంవత్సరానికి నాలుగు బ్యాచ్‌లుగా, ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం ఉంటుంది. ఒక బ్యాచ్‌లో సుమారు 100 మంది మహిళలు ఉంటారు. 15 ఏళ్ల వయస్సు నుంచి 35 ఏళ్ల మధ్యలో గల బాలికలు, మహిళలు ఈ శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు కన్వీనర్ వనశ్రీ: 92465 30048లో సంప్రదించగలరు.

ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్..
సీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మహిళల, కుటుంబ సమస్యలు ఉంటే ప్రత్యేకంగా ఫ్యామిలీ కౌన్సెలింగ్ కూడా తీసుకోవచ్చు. కన్వీనర్ వనశ్రీ నేతృత్వంలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు.

అక్రమ నిర్మాణాలను ఆపాలి


శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేస్తున్న భూనిర్వాసితులు

రాయదుర్గం: ఖాజాగూడలోని సర్వే నంబర్ 27లో అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, వాటిని వెంటనే నిలిపివేయాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. మంగళవారం ఈ మేరకు 23 కుటుంబాలకు చెందిన భూనిర్వాసితులు శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. 1960 నుంచి 1980 వరకు టెనెంట్‌గా ఉన్నామని, ఈ సందర్భంగా పంటలు కూడా పండించడం జరిగిందన్నారు. ఆ తర్వాత కొందరు కావాలని ఈ స్థలాల్ని కబ్జా చేస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వారు ఆరోపించారు. ఈ విషయంలో అధికారులు విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

బండి సంజయ్‌ని కలిసిన రవికుమార్‌యాదవ్



గచ్చిబౌలి: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండిసంజయ్‌ని బీజేపీ రాష్ట్ర నాయకుడు రవికుమార్‌యాదవ్ మంగళవారం కలిశారు. కరీంనగర్‌లోని ఆయన నివాసంలో ఆయనను కలిసి మాట్లాడారు. ఇటీవల ఆయన అత్తమ్మ చిట్ల వనజమ్మ అకాల మరణం చెందడంతో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో పాల్గొని ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఫ్లో కెమిస్ట్రీ కోసం ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు


ఫ్లో కెమిస్ట్రీ ప్రయోగశాలలోని నూతన యంత్రం ఇదే..

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకమైన ఫ్లో కెమిస్ట్రీ కోసం ప్రత్యేక ప్రయోగశాల ఏర్పాటు చేయబడింది. ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఎమినెన్స్ కింద హెచ్‌సీయూలో ఈ ప్రయోగశాలను ఏర్పాటు చేయడం విశేషం. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ విభాగంలో ఏర్పాటు చేశారు. హెచ్‌సీయూలో ఈ ప్రయోగశాలను స్కూల్ ఆఫ్ కెమిస్ట్రీ డీన్ ప్రొఫెసర్ అశ్వినికుమార్ నంగియా, ప్రొఫెసర్ పెరలిరాము శ్రీధర్ వారి పీహెచ్‌డీ విద్యార్థులు, పోస్ట్ డాక్స్‌తో కలిసి ఏర్పాటు చేశారు. ఫ్లో కెమిస్ట్రీ వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయి. అందులో వేగవంతమైన ప్రతిచర్య సమయాలు, నిమిషాల నుంచి గంటకు బదులుగా అనేక గంటలు, ఒకరోజు వరకు ఉంటుంది. చౌకైనది, ద్రావకాలు, రసాయన కారకాలను తక్కువగా ఉపయోగించడం. సౌకర్యవంతమైన ఉత్పత్తి, స్కేల్ అప్, పునరుత్పత్తి కూడా సులభం.

ఫ్లో కెమిస్ట్రీ ప్రయోగశాల హెచ్‌సీయూ ఏర్పాటు గర్వంగా ఉంది..
కెమిస్ట్రీ స్కూల్‌లో ఫ్లో కెమిస్ట్రీ యూనిట్ ఉన్నందుకు హెచ్‌సీయూ గర్వంగా భావిస్తున్నామని హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ సదుపాయం ఈ రంగంలోని విద్యార్థులు, పరిశోధకులకు సులభంగా శిక్షణ ఇచ్చే అవకాశం కలుగుతుందన్నారు. ఈ సదుపాయం కోర్సుల అభ్యాసకులకు ప్రయోగాత్మక అనుభవాన్ని అందించడం ద్వారా సంబంధిత బోధనా కోర్సులను కూడా పెంపొందిస్తుందని ఆశిస్తున్నామన్నారు.

నిఖత్ జరీన్ ప్రయాణం ప్రతి క్రీడాకారునికి ఆదర్శం


నిఖత్ జరీన్‌ను అభినందిస్తున్న నరేంద్ర రామ్ (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: మహిళల ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇటీవల గెలుపొందిన భారతీయ బాక్సర్ నిఖత్ జరీన్ ప్రయాణం ప్రతి క్రీడాకారునికి ఆదర్శమని లైఫ్‌స్పాన్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ నరేంద్ర రామ్ తెలిపారు. తమ సంస్థకు బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తున్న నిఖత్ జరీన్ రెండవ సారి ప్రపంచ బాక్సింగ్ చాంపియన్‌షిప్ స్వర్ణాన్ని అందుకోవడం గర్వంగా ఉందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా హైటెక్ సిటీలోని లైఫ్‌స్పాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ.. ఈ ఘనత సాధించిన రెండవ భారతీయ మహిళగా నిలిచిందని, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో మేరీకోమ్ తర్వాత 2 స్వర్ణాలు సాధించిన మరో భారతీయ బాక్సర్‌గా జరీన్ చరిత్ర సృష్టించిందని నరేంద్ర రామ్ కొనియాడారు.